అడల్ట్స్ ఓన్లీ కథ

# చిగురు

## ఎన్. శివనాగేశ్వరరావు

ఈరోజు నాకు థ్రిల్‌గా ఉంది. నిజం చెప్పాలంటే జీవితంలో ఇటువంటి థ్రిల్ ఏనాడూ అనుభవించింది లేదు. నేను అనుభవిస్తున్న థ్రిల్ తాలూకు ఆనందం, అనుభూతి మాటల్లో చెప్పలేను. ఎలా చెబితే మీరు అర్థం చేసుకోగలరో కూడా నాకు తెలీడం లేదు. ఒక్కటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. నేను చాలా చాలా సంతోషంగా ఉన్నాను.


మా ఇంటి ముందు శంకర్ శవం.. అదే మావారి శవం ఉంది. కొంతమంది ఏడుస్తుంటే, కొందరు విచారవదనాల్లో ఉన్నారు. చాలామంది వస్తున్నారు. శవానికి పూలదండలు వేస్తున్నారు. వచ్చినవారిలో సన్నిహితులు కొందరు నా దగ్గరకు వచ్చి ''ధైర్యంగా ఉండమ్మా! మీవారు పోయినా నీకు మేం ఉన్నాం. అన్ని విధాలా సహాయం చేస్తాం'' అని ధైర్యం చెబుతున్నారు.

నేను లేని విచారం ముఖంలోకి తెచ్చుకుని 'అలాగే' అన్నట్లు తల ఊపసాగాను. లోలోపల మాత్రం మావారు పోయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఎంత సంతోషం అంటే పురాణకాలాల్లో రాక్షసులు చచ్చిపోతే ప్రజలు పండుగ చేసుకునేవారట. అంతటి ఆనందం అనుభవిస్తున్నాను. మనసులో సంతోషం ఉంచుకుని పైకి బాధ నటించడమే నేను చెప్పిన థ్రిల్. అది నిజంగా అనుభవిస్తేనే తెలుస్తుంది.

తాళి కట్టిన భర్త చనిపోతే ఈ అమ్మాయేంటి ఆనందంగా ఉంటున్నదని మీలో కొందరు ఆశ్చర్యపోవచ్చు. కొందరు అసహ్యించుకోవచ్చు. మరికొందరు కొంత అర్థం చేసుకుని బ్రతికుండగా బాధలు పెట్టి ఉంటాడు. ఎంతయినా భర్త చనిపోయినప్పుడు బాధపడడం హిందూ స్త్రీ ధర్మం అనవచ్చు.

శంకర్ బ్రతికుండగా నన్ను బాధలు పెట్టి ఉంటే నేను తప్పక భరించి ఉండేదాన్ని. ఎందుకంటే చిన్నప్పటినుంచి బాధలు పడడం నాకు అలవాటే! అతను తాగి వచ్చి కొడితేనో, అమ్మాయిలతో తిరిగి వచ్చి తిడితేనో నేను తప్పక అతన్ని మార్చుకొని ఉండేదాన్ని.

కానీ శంకర్ ఏం చేసేవాడో తెలుసా? బయట అందరితో ఎంతో మంచిగా ఉండేవాడు. నా దగ్గర మాత్రం చాలా చెడ్డగా ఉండేవాడు.



అతనా ద్విపాత్రాభినయం ఎంతో బాగా చేసేవాడు. ఎంత బాగా అంటే నా భర్త మంచివాడు కాదు అని నేను ఎవరితో చెప్పినా నమ్మరు. నమ్మలేదు. అంతవరకు ఎందుకు? మీ అల్లుడు మంచివాడు కాదు అని నా తల్లిదండ్రులతో చెబితేనే వాళ్ళు నమ్మలేదు. మా అమ్మయితే ''నీ మతి చెడిందే! లేకుంటే బంగారంలాంటి భర్తని చెడ్డవాడంటావా?'' అని నా నోరు నొక్కేసింది. అప్పుడే అనుకున్నాను. మరెవరితోనూ అతని చెడ్డతనం గురించి చెప్పకూడదని.

శోభనం రాత్రే శంకర్ తనలోని రెండో మనిషిని నాకు బాగా చూపించాడు. అతనున్న గదిలోకి నన్ను పాలగ్లాసుతో పంపించారు. తలుపులు మూతపడ్డాక నేను సిగ్గుతో అక్కడే నిలబడ్డాను. శంకర్ మెల్లగా నా దగ్గరకు వచ్చి మంచం దగ్గరికి నడిపించుకు తీసుకుపోలేదు.

''ఇటువంటి ఫార్మాలటీస్ నాకు నచ్చవు. వచ్చి నా పక్కన కూర్చో'' అని స్పష్టంగా చెప్పాడు. అతను చెప్పినట్లే చేసాను. అయిదు నిముషాలు గడిచాయి. అతను నన్ను తమకంతో అల్లుకుపోలేదు. నా సిగ్గు పోగొట్టడానికి మాటలు కలపలేదు.

''ఇప్పుడు ఇక్కడేం జరుగుతుందో నీకు తెలుసా? ఫ్రాంక్‌గా చెప్పు. ఐ లవ్ ఫ్రాంక్‌నెస్'' అన్నాడు శంకర్.

''తెలుసు'' అన్నాను.

''తెలిస్తే చెప్పు'' అన్నాడతను.

నేను సందేహిస్తూనే ''మీరు నన్ను కౌగిలిలోకి తీసుకుంటారు'' అన్నాను.

''ఆ తరువాత?'' అన్నాడు శంకర్.

''సిగ్గుగా ఉంది'' అన్నాను.

''సిగ్గెందుకు? చెప్పు'' అన్నాడతను కఠినంగా.

చిన్నప్పుడు ప్రశ్నకు సమాధానం చెప్పకపోతే బెత్తంతో చేతి మీద కొట్టే మాస్టారు గుర్తుకొచ్చాడు. అందుకే సిగ్గువిడిచి చెప్పాను.

''ఆడదానివై వుండి సిగ్గులేకుండా మాట్లాడావు. ఐ హేట్ యూ!'' అని శంకర్ గది

తలుపు తీసుకుని బయటకు వెళ్ళి అక్కడున్న సోఫాలో చేరగిలబడ్డాడు.

అమ్మ చూసి ''అదేంటి నాయనా? ఇక్కడ పడుకున్నావు?'' అని అడిగితే శంకర్ తల దించుకుని బిడియపడుతూ ''ఒంటిమీద చెయ్యి వేస్తే మీ అమ్మాయి బెదిరిపోతున్నది అత్తయ్యగారూ! తనను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఇక్కడ పడుకున్నాను'' అని అందంగా అబద్ధం చెప్పాడు.

అమ్మ వచ్చి ''అతను మంచివాడు కాబట్టి సర్దుకుపోయాడు. అదే మరొకరైతే పెద్దరగడ జరిగి ఉండేది'' అని నన్ను నానా చీవాట్లు పెట్టింది.

నేను చెప్పబోయింది అసలు వినిపించుకోలేదు. అప్పుడే తెలిసింది అతను చాలా బాగా డబుల్‌గేమ్ ఆడతాడని.

అతనితో కాపురానికి హైదరాబాద్ బయలుదేరాను. శంకర్, మా నాన్నగారి చేతులు పట్టుకుని ''మామగారూ! నేను మీ అమ్మాయిని బాగా చూసుకోనని ఏమైనా అనుమానమా?'' అని అడిగాడు.

''అటువంటిదేం లేదు బాబూ? నీలాంటి మంచివాడు మాకు అల్లుడైనందుకు మాకు చాలా గర్వంగా ఉంది'' అన్నారు నాన్నగారు.

''థేంక్యూ! నేను మీ అమ్మాయిని ప్రాణప్రదంగా చూసుకుంటాను ప్రామిస్'' అని నాన్నగారి చేతిలో చేయి వేసాడు శంకర్.

ఆ దృశ్యం చూసి శంకర్ నేను అనుకునేంతటి చెడ్డవాడు కాదేమోనని సరిపెట్టుకున్నాను. అతని వెంట హైదరాబాద్ చేరాను.

వివాహమైన సందర్భంగా శంకర్ తన కొలీగ్స్ అందరికీ ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో విందు ఏర్పాటు చేశాడు. అక్కడికి నన్ను తీసుకువెళ్ళే ముందు ''మా కొలీగ్స్ అందరితో సోషల్‌గా మాట్లాడు. లేకపోతే పల్లెటూరిది అనుకుంటారు. అక్కడ వాళ్ళు నమస్తే చెబితే చేతులు జోడించి నమస్తే చెప్పు. ఎవరైనా షేక్‌హేండ్ ఇస్తే బిడియపడకుండా చేయి కలుపు. నాకు ఎటువంటి చెడ్డ పేరూ రాకూడదు'' అని ప్రత్యేకంగా చెప్పాడు.

''అలానే'' అని బుద్ధిగా తల ఊపాను.

ఫంక్షన్‌లో అందరూ కలుపుగోలుగా మాట్లాడారు.

భాస్కర్ అనే అతను మాత్రం పరిచయం చేయగానే ''నైస్ టూ మీట్యూ'' అని షేక్ హేండ్ ఇచ్చాడు.

మావారు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుని నేనూ చేయి కలిపాను. పార్టీ బాగా జరిగింది. కొందరు మావారితో ''నీ వైఫ్ చాలా సోషల్. లక్కీ ఫెలోవి'' అనటం విన్నాను.

''అమ్మయ్య'' అని ఊపిరి పీల్చుకున్నాను.

కానీ ఆ తృప్తి ఎంతోసేపు మిగల్లేదు. ఇంటికొచ్చాక ''ఏంటి ఆ భాస్కర్‌గాడు షేక్‌హేండిస్తే చేయి వదల్లేదు.. అంత బాగా నచ్చాడా?'' అన్నాడు శంకర్.

''మీరేగా షేక్ హేండిస్తే చేయి కలపమన్నారు'' అన్నాను.

''చేయి కలపమన్నానుగాని వదలకుండా పట్టుకోమనలేదుగా'' అన్నాడు శంకర్. ''వాడసలే పెద్ద తిరుగుబోతు. కాస్తంత అందంగా ఉంటే చాలు వెంటపడతాడు. అటువంటి వాళ్ళను మనమే వదిలించుకోవాలి'' అన్నాడు.

''ఆ సంగతి నాకు తెలీదుకదా! ఈసారి జాగ్రత్త పడతాను'' అన్నాను.

''అంటే మరోసారి వాడిని కలవాలని ఉందన్న మాట'' అన్నాడు శంకర్.

ఏం మాట్లాడాలో తెలియక మౌనం వహించాను. ఆ రాత్రి శంకర్ వేరే గదిలో పడుకున్నాడు.

ఆ తరువాత మొదలైంది టార్చర్. కదిలితే తప్పు. మెదిలితే తప్పు. ఎవరైనా మగవారు ఇంటికి వస్తే వాళ్ళముందు ''ఏంటి గాయత్రీ! అలా బిడియంగా ఉంటావు. వచ్చిన వాళ్ళు మనకు కావలసినవారు వాళ్ళతో క్లోజ్‌గా ఉండడం అలవాటు చేసుకో!'' అని వాళ్ళకు సారీ చెప్పేవాడు.

వాళ్ళు వెళ్ళాక ''ఏంటీ అలా గుడ్లప్పగించి చూసావు. వాడు నాకంటే బాగున్నాడా? లేచిపోదామని ప్లాన్ చేస్తున్నావా?'' అని మానసికంగా హింసించేవాడు. అతను నన్నెంతగా క్షోభపెడుతున్నాడో ఎవరికి చెప్పినా నమ్మరు. ఎందుకంటే వాళ్ళ ముందు అంత మంచిగా నటించేవాడు.

మా పెళ్ళయి ఏడాదయింది. యానివర్శరీ ఫంక్షన్‌కి వచ్చిన వారందరూ ''నీకు బంగారంలాంటి భర్త దొరికాడు. నీవు చాలా అదృష్టవంతురాలివి'' అని పొగిడారు. నేను మాత్రం శంకర్‌తో సంసారం చేయడంకంటే ఉరిశిక్ష నయం అనుకున్నాను మనసులో.

ఒకసారి శంకర్ ఆఫీస్ పనిమీద టూర్‌కి వెళ్ళాడు. కళ్ళు తిరిగినట్లు అనిపించి డాక్టర్ని కలిసాను. నాకు ప్రెగ్నెన్సీ అని కన్‌ఫర్మ్ చేసిందామె.

శంకర్ వచ్చాక భయపడుతూనే ఆ విషయం చెప్పాను. నా భయం వమ్ము చేస్తూ అతను నన్ను దగ్గరకు తీసుకుని కంగ్రాట్స్ చెప్పాడు. పెళ్ళయ్యాక తొలి

## భావన పెళ్లి?

కేరళ కుట్టి భావన ఇప్పుడిప్పుడే తెలుగులోకి వస్తోంది. తమిళం, మలయాళంలో బిజీగా వున్న భావన- తెలుగు యువ హీరో నితిన్‌ని పెళ్లి చేసుకోబోతోందనే వార్త టాలీవుడ్‌లో గుప్పుమందిప్పుడు. ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్న సినిమా ఇంకా నిర్మాణంలో వుంది. ఆ సందర్భంగా ఇద్దరి మధ్యా ప్రేమ చిగురించి పెళ్లికి దారి తీస్తోందని సినీజనాలు చెవులు కొరుక్కుంటున్నారు. గతంలో కూడా జెనీలియాతో నితిన్ ఎఫైర్ గురించి వార్తలు వచ్చాయి. అది వుత్తుత్తి వార్తే అని తేలిన ఇన్నాళ్లకి మళ్లీ నితిన్-భావన వ్యవహారం ప్రచారంలోకొచ్చింది. ఇది కేవలం ప్రచారమేనా? లేక నిజమేనా అనేది కాలమే చెప్పాలి.



సారి సంతోషంగా ఫీలయ్యాను. అయితే అది క్షణం మాత్రమే. అంతలో అతను నాకు దూరంగా జరిగి ''ఇంతకీ ఎవరా హీరో?'' అని ప్రశ్నించాడు.

''ఏ హీరో?'' అర్థంకాక అడిగాను.

''అదే నీకు కడుపు తెచ్చిన వాడెవడు?'' కర్కశంగా అడిగాడు.

ఆ మాటకు నా హృదయం ఛిద్రమైంది.

''ఏం మాట్లాడుతున్నారు మీరు. నేను అలాంటిదాన్ని కాను'' అన్నాను సిగ్గుతో చితికిపోతూ.

''చూడు గాయత్రీ! నాకు పిల్లలు పుట్టే ఛాన్స్ లేదు. ఆ విషయం డాక్టర్లు ఎప్పుడో తేల్చి చెప్పారు. కాబట్టి నీకు పుట్టబోయే బిడ్డ నా బిడ్డ కాదు. అయినా నీకో ఛాన్స్ ఇస్తున్నాను. నిజం చెప్తే నిన్ను తిట్టను, కొట్టను. అంతేకాదు పుట్టిన బిడ్డను నా బిడ్డగానే చలామణి చేస్తాను'' అన్నాడు శంకర్.

నా హృదయంలో అతని మీద దాగి ఉన్న అసహ్యమంతా ఒక్కసారి బయటికొచ్చి ''ఛీ!'' అన్నాను.

మరుక్షణం శంకర్ నా చెంప పగలగొట్టి ''తింగరి వేషాలు వేస్తే చంపి పాతరేస్తా'' అన్నాడు.

రెండు రోజులు నేను పచ్చి గంగ కూడా ముట్టలేదు. అతనూ తినమని అడగలేదు. అంతలో నాకు అబార్షన్ అయింది. బలహీనంగా ఉండడాన్నే అబార్షన్ అయిందని లేడీ డాక్టర్ నాతోపాటు, శంకర్ని కూడా మందలించింది. అప్పుడు శంకర్ చేసిన నటన జన్మలో మరచిపోలేను.

''డాక్టర్! గాయత్రి నా ప్రాణం. పుట్టబోయే బిడ్డ గురించి ఎన్నో కలలు కన్నాను. ఇలా జరుగుతుందని అనుకోలేదు. డాక్టర్! నన్ను క్షమించండి'' అని కంటనీరు పెట్టుకున్నాడు.

అది చూసి డాక్టరు కూడా బాధపడి ''సారీ! మిమ్మల్ని బాధపెట్టాను'' అంది.

ఇంటికి వచ్చాక శంకర్ నామీద విరుచుకుపడ్డాడు. ''కావాలనే అబార్షన్ అయ్యేలా చేసుకున్నావు. నా బిడ్డను నాకు కాకుండా చేసావు'' అని తిట్టిపోసాడు.


''అదేంటి అలా మాట్లాడుతున్నారు. నాకు వచ్చిన కడుపు ఎవడి వలనో వచ్చిందని గొడవ గొడవ చేసారు కదా!'' అన్నాను.


''అదేదో సరదాకు అన్నాను. దాన్ని సీరియస్‌గా తీసుకుంటావా? నీవు ఒట్టి మెంటల్ దానివి'' అని నన్ను తోసి బయటకుపోయాడు శంకర్.

ఆ నరకం భరించలేక పుట్టింటికి వెళ్ళి అమ్మకు జరిగింది చెప్పాను. అంతలో శంకర్ అక్కడకు వచ్చాడు. ''అత్తయ్యగారూ! ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మీ అమ్మాయికి అబార్షన్ అయింది. ఆ డిప్రెషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నది. డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళేలోపు చెప్పకుండా మీ దగ్గరకు వచ్చేసింది. తనకోసం నేనెంతో ఆందోళన చెందాను'' అని కళ్ళనీరు పెట్టుకున్నాడు. అతని నటనకు అమ్మ, నాన్న పడిపోయారు.

''నీ భర్త దేవుడు. అతను చెప్పినట్లు నడుచుకో!'' అని నన్ను మందలించి అతనితో పంపారు. 'అతనితో కాపురం చేయడం కంటే చావడం నయం' అని నిశ్చయించుకున్నాను.

అంతలో అనుకోని సంఘటన జరిగింది. ఆఫీస్ నుంచి మోటర్ బైక్‌మీద వస్తున్న శంకర్‌కి రోడ్ యాక్సిడెంట్ అయింది. స్పాట్‌లోనే చనిపోయాడు. ఆ వార్త నాకు ఫోన్ ద్వారా తెలిసింది. ఒక్క క్షణం దిగ్భ్రాంతి చెందాను. మరుక్షణం కీచకుడి, రావణాసురుడు వంటి రాక్షసులు చచ్చినంత సంబరం కలిగింది. ఇనప పంజరం నుంచి







## కొత్తింట్లో లారా!

లారా దత్తాకి ఈమధ్యనే కెరీర్ కాస్త ఆశాజనకంగా మారుతోంది. ఇంతకు ముందులా మరీ ఖాళీగా కాకుండా సినిమాలు, స్టేజ్ షోలతో బిజీ బిజీగా వుంటోంది. దాంతో వచ్చిపడుతున్న 'కరెన్సీ'ని ఏం చేసుకుంటుంది? అందుకనే పెద్ద ఫ్లాట్‌ని కొనేసిందిట. అది కూడా తన బాయ్‌ఫ్రెండ్ డినో మోరియా ఇంటికి సమీపంలోనేట. నూతన గృహప్రవేశం ఆమె కెరీర్‌కి మరింత కలిసొస్తుందేమో అని బాలీవుడ్ జనాలు లెక్క లేస్తున్నారు.

బయటపడినట్లు... రెక్కలు వచ్చి స్వేచ్ఛగా ఎగురుతున్నట్లు అనిపించింది.

వెళ్ళి శవాన్ని చూసాను. శంకర్ బతికుండగా చక్కగా నటించి అందరినీ మెప్పించినట్లే శవం అయ్యాక కూడా చక్కగా నటిస్తున్నట్లు అనిపించింది. ముఖం ప్రశాంతంగా, ఎంతో అమాయకంగా ఉంది. పెదాలు విచ్చుకుని నవ్వుతున్నట్లున్నాయి. శవాన్ని చూసిన కొలీగ్స్ ''ఎంత మంచివాడో! అందుకే దేవుడు తొందరగా తీసుకుపోయాడు'' అనుకోవడం విని మనసులో నవ్వుకున్నాను.




పోలీసులు రావడం, కేసు ఫైల్ చేయడం, పోస్ట్ మార్టం చేయడం అన్నీ జరిగిపోయాయి. శవం ఇల్లు చేరింది. అందరూ వచ్చారు. ఏడ్చారు. నన్ను ఓదార్చారు. నాకు మాత్రం ఏ మాత్రం దిగులు లేదు. లోలోపల ఎంతో సంతోషంగా ఉంది.

శవానికి స్నానం చేయించారు. పట్టుబట్ట కప్పారు. పాడెపైకి లేచింది. బంధువులంతా గొల్లుమన్నారు. నేను మాత్రం భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

మూడు నెలలు గడిచాయి. శంకర్ ఆఫీస్‌లోనే నాకు ఉద్యోగం ఇచ్చారు. అక్కడ అందరూ నాతో స్నేహంగా మసలుకున్నారు. ఆఫీస్ పని నాకేం కష్టంగా అనిపించలేదు. కానీ అందరూ శంకర్‌ని పొగుడుతుంటే మాత్రం ఒంటికి కారం రాసినట్లు ఉండేది. 'రాస్కెల్! ఎంత బాగా నటించేవాడో' అనుకునేదాన్ని.

సంవత్సరం ఇట్టే గడిచిపోయింది. కొత్త జీవితం ఎంతో బాగుంది. జైలు నుంచి బయటపడిన నిర్దోషిలా..పులి పంజా నుంచి తప్పించుకున్న లేడికూనలా అనిపించేది.

మా ఆఫీసులో పనిచేసే భాస్కర్ ఒకరోజు నన్ను కలిసాడు. అతనికి షేక్ హేండ్ ఇచ్చినందుకే గతంలో శంకర్ నన్ను ఎన్నెన్నో మాటలు అన్నాడు.

''ఇలా అడుగుతున్నందుకు మరోలా అనుకోకండి. మీకభ్యంతరం లేకపోతే మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. ఇదేదో త్యాగంలా నేను ఫీలవడం లేదు. మీవంటి మంచి మనిషి భార్యగా దొరకడం నా అదృష్టం. తొందర లేదు. ఆలోచించి చెప్పండి'' అన్నాడు భాస్కర్.

నేను ఉద్యోగంలో చేరి సంవత్సరం అయింది. భాస్కర్ గురించి క్షుణ్ణంగా తెలుసు. శంకర్ దూషించినట్లు అతనేం తిరుగుబోతు కాదు. మంచి మనిషి.

భాస్కర్ ప్రపోజల్ మెల్లగా ఆఫీస్‌లో అందరికీ తెలిసింది. కొందరైతే అతన్ని పెళ్ళి చేసుకోమని నాకు సలహా ఇచ్చారు. నాకూ భాస్కర్‌ని తిరస్కరించడానికి కారణం ఏం కనిపించలేదు.

విషయం తెలిసి శంకర్ తల్లిదండ్రులు నన్ను కలిసి ''అమ్మా! ఒంటరిగా ఉండడం కంటే మంచి వ్యక్తి తారసపడినప్పుడు వివాహం చేసుకోవడమే మంచిది. నీవు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే శంకర్ ఆత్మ కూడా శాంతిస్తుంది'' అన్నారు.


తనలోని శాడిజాన్ని తల్లిదండ్రులకు కూడా తెలియనివ్వని శంకర్ నిజంగా ఎంతో ఘటికుడని మనసులో అనుకున్నాను.

భాస్కర్‌తో నా పెళ్ళి సింపుల్‌గా జరిగిపోయింది.

ఇల్లు చేరాక భాస్కర్, శంకర్ ఫోటోకి దండం పెట్టి ''ఫోటోలోని శంకర్ మనలను చూసి సంతోషంతో నవ్వుతున్నట్లు అనిపిస్తుంది కదూ!'' అన్నాడు. నాకైతే మాత్రం శంకర్ మమ్మల్ని చూసి కుళ్ళుకుంటూ ఏడుస్తున్నట్లు అనిపించింది. అయితే ఆ మాట భాస్కర్‌తో అనలేదు. ఎందుకంటే నేను చెప్పినా భాస్కర్ నమ్మడు. శంకర్ అంత బాగా అందరినీ నమ్మించాడు.

గదిలో భాస్కర్ ఆర్తితో నన్ను హృదయానికి హత్తుకున్నాడు. నా జీవితం మరలా చిగురు తొడిగినట్లు అనిపించింది. మల్లెతీగలా అతన్ని అల్లుకుపోయాను. అంతలో చిత్రంగా శంకర్ నాకు గుర్తుకు వచ్చాడు. అతని ఆత్మే ఈ దరిదాపుల్లో ఉంటే నేను, భాస్కర్‌తో సంతోషంగా ఉన్న దృశ్యం చూసి సుదూర తీరాలు పారిపోతుంది. పారిపోవాలి కూడా. అదే నాకు కావలసింది.

☆



## హన్సిక క్రేజ్!

**టాలీవుడ్‌లో ఎప్పుడు ఎవరు అందలం ఎక్కుతారో ఊహించని రోజులివి. నిన్న మొన్నటి వరకూ ఇలియానాని టాప్ స్టార్ అన్న వాళ్లంతా ఇప్పుడు కుర్ర హీరోయిన్ హన్సికని ఆకాశానికెత్తేస్తున్నారు. ఆమె క్రేజ్ ఎంతగా వుందంటే సినిమాకి 75 లక్షల వరకూ డిమాండ్ చేయగల స్థితిలో వుందని సినీ ట్రేడ్ వాలాల వ్యాఖ్య. పవన్ కల్యాణ్ 'పులి'లో బల్క్‌గా 75 కాల్షీట్లు ఇవ్వలేనందుకే ఆమె తప్పుకోవాల్సి వచ్చిందిట. కెరీర్‌ని సరిగ్గా ప్లాన్ చేసుకోవాలేగానీ హన్సిక టాప్ స్టార్ అయ్యే చాన్సులున్నాయని సినీ పండితుల ఉవాచ. మరి హన్సిక పథకాలేంటో!**